# పడమటింట్లో వెన్నెల

"మంజుశ్రీ"

కథానిక

జాబిల్లి గంపెడు దుఃఖపడ్డది. బావిప్రక్కన సిమెంటు చప్టామీద, గన్నేరు చెట్టుక్రింద ఎవరూ వినకుండా, ఎవరూ కనకుండా జాబిల్లి యేడ్చింది. జాబిల్లి హృదయం ద్రవించి పోయింది. గడ్డంకింద చేయి ఆన్చి, ఆ చేయికి ఆలంబనంగా మోకాలు నుంచుకుని, జాబిల్లి కన్నీళ్లు పెట్టుకుంటుంటే, కన్నీళ్లు వరదలై, నున్నటి చెంపలవెంబడి జారుతూ, అమ్మ పెట్టిన కాటుకచుక్కను కరిగి పోయేట్లు చేసి, పాదాలమీది పారాణినికూడా తడిపినవి. ఆ సింగారమంతా యథాతథంగానేవుంది. తలంటుపోసి వదులొాదులుగా జడేసి పెండ్లి కూతుర్ని చేశారు కాళ్లకు లాక్ష, కళ్ళకు కజ్జలమూ, నిండు చంద్రుడిలాంటి ముఖబింబమూ, పెండ్లి కూతురి రూపంలో జాబిల్లి దేవకన్యలావుంది. కాని ఆమె హృదయం మాత్రం ఉత్తుంగత రంగాలతో ప్రళయసంచలనం పొందిన వారాసిలా వున్నది.

మధ్యాహ్న మప్పుడు ఇందిర వచ్చింది. ఏదో కాస్త సానుభూతి చూపించి పోతుందిలే అనుకుంది తాను, రేగిన పుండుమీద కారం చల్లినట్లు తుకతుక వుడికిపోయే తన హృదయాన్ని తూట్లు పడేట్లు పొడిచి నొప్పించింది ఇందిర. "ఒట్టి నినాదాలు మాత్రమే నన్నమాట! సమయంవచ్చేటప్పటికి బలహీనత పొందడమా? ఎవరోకన్న బిడ్డలకు జీవితాంతం సేవచేసి బ్రతకటమేనా నీ రాత? అంతకంటే వేరే ఉపాయంలేదూ? పిరికితనం. ఒట్టి పిఱికితనం అంతకుతప్ప ఏమీలేదు. ఒక్క రెణ్ణెల్లక్రితం నువ్వేమని మాట్లాడావు? భవిష్య జ్జీవితం గూర్చి ఏమని చెప్పావు? ఎన్నెన్ని కలలు కన్నావు. అన్నీ గంగపాలేనా? అవన్నీ పేక మేడలేనా? జాబిల్లీ ఆలోచించు. వందయేండ్ల జీవితం. వెయ్యేళ్ళపంట. ఇంతేనా. ఇంతకంటే ఏమీలేదూ? ఇప్పటికైనా మునిగిపోయిందిలేదు. ఆలోచించు. తర్వాత దుఃఖపడతావు. సుఖం వుండదు. జీవితంలో శాంతివుండదు" అని ఉపన్యాసం చెప్పిపోయింది ఇందిర. పుండు రేపినట్లయింది. తన హృదయం ఇదివరకే వుడికిపోతున్నది. ఇప్పుడు మరీనూ.

తానేమని చెప్పగలుగుతుంది? చెప్పగలిగినంత మటుకు ఇదివరకే చెప్పింది. నాన్నగారు ఏం చూసుకున్నారో మరీ పట్టుదలగా వున్నారు. అమ్మ నాన్నగారి కెదురు చెప్పలేదు. తాను ప్రయత్నం చేయదలుచుకున్నంతమటుకు, ప్రయత్నం చేసింది. ఫలితంలేకపోయింది. అన్నయ్యదగ్గిరికెళ్ళి ప్రాధేయపడ్డది. అన్నయ్య ఏంచేయగల్గుతాడు? అన్నయ్య దిగులుగా మొహంపెట్టాడు. ఏడ్చినంత పని చేశాడు. నాన్నగారిదగ్గరకుపోయి నసిగాడు "ఈ సంబంధం ఎందుకు మార్పించలే"రంటూ. నాన్నగారు చెప్పారు: "పాతికేళ్ళు నిండీనిండకపోవటం వయసు చెల్లటమటరా? కుర్రాడు బుద్ధిమంతుడు. సంప్రదాయంగల కుటుంబం. చదువుకున్నవాడు. వంద రాళ్ళు తెచ్చుకుని స్వతంత్రంగా జీవితం వెళ్ళదీసుకుంటున్నాడు. రూపవంతుడు. ఇక ఏమిటి కొదవ, రెండో సంబంధమనేగా? ఏం అయితే? మీ అమ్మ నాకు రెండో సంబంధం కాదూ! ఏమైంది అంతమాత్రంచేత? నా జీవితంలో లోటేమిటి? నువ్వెప్పుడైనా మీ అమ్మను మారుటితల్లి దృష్టిలో చూశావా? మీ అమ్మ నిన్ను కన్నకొడుకులా చూసుకోవటం లేదూ?" అన్నారు.

నిజమేమరి. అన్నయ్యకూ, తనకూ అమ్మ భేదమేం చూపెడుతున్నది? నాన్నగారి జీవితంలో లోటేమిటి అని తనను తాను ప్రశ్నించుకుంది. సమాధానం ఏం తోచలేదు జాబిల్లికి. తనకు ఇష్టంలేదు. అంతే. వీటన్నిటికీ తాను సమాధానం చెప్పలేదు. అమ్మముందుకెళ్ళి భోరున యేడ్చింది. అమ్మ లేచింది, "ఈ సంబంధం ఎలానైనా మార్పించండి. కుర్రాడు బుద్ధిమంతుడైనా, రూపవంతుడైనా, ఆస్తిపాస్తులున్నా, ఏమున్నా కడిగిన కాళ్లు కడగటమేకదా? ఈ సంబంధం నేనొప్పుకోను"అంది.

నాన్నగారు అప్పటికేమీ మాట్లాడలేదు. మధ్యాహ్నం కాఫీ తీసుకపోయి యిచ్చినప్పుడు, "ఇలా కాసేపు కూర్చో తల్లీ" అన్నారు నాన్నగారు. అక్కడ కుర్చీలో కూలబడింది తాను. నాన్నగారు మొదలెట్టారు, "చూడు తల్లీ, నువ్వు ఇంటర్ ప్యాసయి చదువు మానెయ్యాల్సిన కారణం తెలుసుగా. డబ్బులేదు. అన్నయ్య ఈ రెండేళ్లు చదివాస్తేకదా ఆనర్సయి వొడ్డునపడేది. ఇప్పుడు నేను పెళ్ళికి డబ్బెక్కణ్ణించి తెచ్చేను. అన్నయ్య చదువు కావాలి. ఇంకా ఇద్దరు చెల్లెళ్లూ, తమ్ముడూ వాళ్ళ గతేమిటి? నాకొచ్చేది అరవై అయిదురూపాయలుకదా! ఇంకో ఇరవై యీ పోస్టాఫీసు పెట్టిన తర్వాతకదా యియ్యటం. ఎలానమ్మా? నీకు పదహారేళ్ళు నిండుతున్నాయి. అతనైనా అసలు పెండ్లి చేసుకోను అంటున్నాడట. చివరకు ఎలా అయితేనేం వొప్పుకున్నాడు అది నా అదృష్టంగా భావిస్తున్నాను నేను. నాలుగేళ్ళ కుర్రాడున్నాడు. సంబాళించుకోలేవూ? మీ అమ్మ యీ ఇంటికొచ్చేటప్పటికి నాకు దిక్కులేదు. అన్నయ్య రెండేళ్ళవాడు. అమ్మ ఇవన్నీ దిద్దుకోలేదా? ఏమంటావమ్మా" అన్నారు. తాను తలవంచుకుని "మీ ఇష్టం నాన్నా" అన్నది. నాన్నగారు తలవూపారు. అమ్మ సరేనన్నది. అన్నయ్య పదిహేను రోజులుండవలసినవాడు మర్నాడే వాల్తేరెళ్ళిపోయాడు.

అమ్మ ఆ రోజునుంచే పెండ్లిపనులు మొదలెట్టింది. ఇవాళ ఇందిర వచ్చి యిన్ని మాటలని పోయింది. ఇందిరకేం అదృష్టవంతురాలు. ఒక్కత్తే ఆడపిల్ల. ఆస్తిపాస్తులున్నాయి. తాను ఇంటరుతో ఆపవల్సి వచ్చింది. ఇందిర ఆనర్సు చదువుతున్నది. జాబిల్లి ఊహలు సుళ్ళుసుళ్ళుగా తిరుగుతున్నాయి మనసులో. పడమట కొండమీద చంద్రుడు పైకొచ్చాడు. జాబిల్లి బుగ్గలమీద కన్నీళ్లు చారలు కట్టినయ్. వివాహ మండపంలో సన్నాయి వూదారు. జాబిల్లి ఊహాలకు బ్రేకు పడిపోయింది. తల్లి వెతుక్కుంటూ వచ్చి భావి పక్క సిమెంటు చప్టామీద, గన్నేరుచెట్టుకింద, మూర్తీభవించి వున్న శోకదేవతలావున్న కూతురిని చూసింది. బుగ్గలమీది కన్నీటి చారికలు వెన్నెట్లో స్పష్టంగా కనిపించాయి. తల్లి క్షణంసేపు కొయ్యబారిపోయి తరవాత పెగల్చుకొని అన్నది: "ఈ పెండ్లి జరగటానికి వీల్లేదు, ఎలా అవుతుందో చూస్తానుగా, విడిదిలో దిగిన పెండ్లివాళ్ళు, ఈ ఇంట్లో అడుగుపెట్టకుండానే వెనక్కు తిరిగి వెళ్ళిపోవాలి." జాబిల్లి వులిక్కిపడ్డది. ఇంట్లోకి వెళదామని లేచి నిల్చింది. తల్లి వంటయింట్లోకి వెళ్ళిందల్లా తిరిగివచ్చి "ఎందుకే అలా వుంటావు. తప్పమ్మా. శుభమా అని, లగ్నంముందు కన్నీళ్ళు పెట్టుకుంటా వెందుకమ్మా? తప్పు కదూ. ఏది ఇలా చూడు. నీకొచ్చే కష్టమేమిటి. నా సంగతి గుర్తు తెచ్చుకో. సంతోషంగా వుండు తల్లీ" అని రెక్క పుచ్చుకొని ఇంట్లోకి తీసుకెళ్ళి కూచోబెట్టింది.

లగ్నం సమీపించనూ సమీపించింది. బాజా భజంత్రీలు బ్రహ్మాండంగా మోగనూ మోగినయ్. మొగపెళ్ళివాళ్ళూ, ఆడపెళ్ళివాళ్ళూ సరాగాలాడనూ ఆడుకున్నారు. ఎక్కడినుంచో అన్నయ్య వూడిపడ్డాడు. అన్నయ్యకూ, తనకూ తప్ప యీ పెండ్లి అందరికీ సంతోషదాయకంగానే వుంది. ఇదేం ఆగేది కాదు. తాను అచేతనంగా పురోహితుడు చెప్పిన పనల్లా చేసింది. ఆయన కూడా అంత సంతోషంగా లేరు. ఎందుకో మరి. ఎలా అయితేనేం పెండ్లి జరిగింది. మర్రోజు సాయంత్రం కారురోడ్డుదాకా పాలకీ యెక్కి రాఘవరావు జాబిల్లిని వెంటపెట్టుకుని, మాట్లాడుకున్న స్పెషల్ బస్సులో ఎక్కి పల్లెటూరి స్వగృహానికి చేరాడు. కారు దిగంగానే గుమ్మంలో నిలబెట్టి పెద్ద ముత్తైదువులు పేర్లు చెప్పించారు. ఇంట్లో కెళ్ళి కుర్చీలో కూర్చుని "తన ఇల్లు మళ్ళీ కళకళలాడింది" అనుకున్నాడు రాఘవరావు. "చీకటి ముసురుకుంది. ఇక వెలుక్కు ఆస్కారం లేదు తన జీవితంలో" అనుకుంది జాబిల్లి.

పది రోజులైన తర్వాత ఎటు చుట్టాలటు పోయారు. ఇంట్లో రాఘవరావూ, జాబిల్లీ, ఐదేళ్ళ కృష్ణా మిగిలారు. చుట్టాలంతా వెళ్ళిపోయిన తర్వాత జాబిల్లి వోసారి ఇల్లంతా కలయచూసింది. పంచ నంటుకొని ఓ గది వుంది. దాంట్లోకి వెళ్ళిచూస్తే జాబిల్లికి రేడియో కనపడ్డది. రాఘవరావు కొత్తగా తెచ్చిన బేటరినీ అమరుస్తున్నాడు. తలెత్తి చూడలేదు. క్షణంసేపు నిలబడి

జాబిల్లి వెళ్ళిపోయింది. వంటఇంట్లో వొకమూల బాయిలర్ కనపడ్డది. జాబిల్లి ఆశ్చర్యపడ్డది. రేడియో చూసినందుకే ఆశ్చర్యం ముంచెత్తింది. దాన్ని బాయిలర్ మరీ ఎక్కువ చేసింది. ఈ పదిరోజుల నుంచీ భోజనం చేయడం, అమ్మదగ్గరే ప్రొద్దస్తమానం తిరగటం, పడుకోవటంకూడా సాగించింది. అమ్మ కోప్పడేది. జాబిల్లి కన్నీళ్లు పెట్టుకునేది. రాఘవరావు ఐదురోజులు అసలు వూళ్ళోనేలేడు. పది రోజులైన తర్వాత తల్లికూడా వెళ్ళిపోయింది. తల్లి వెళ్ళిపోయిన రోజున జాబిల్లికేమీ తోచలేదు. పిల్లవాడు తనవైపు బిక్కుబిక్కుమంటూ చూసేవాడు. దగ్గరకు తీసుకుందా మనుకున్నా వచ్చేవాడు కాడు. ప్రొద్దుటే కాఫీతాగి, నాన్నగారితోటి పాటే స్కూలు కెళ్ళిపోయేవాడు. మళ్ళీ పదిగంటలకు వచ్చి నాన్నగారితోటి భోజనం చేసేవాడు. మళ్ళీ మూడు గంటలకు నాన్నతో స్కూలుకు వెళ్ళటం, ఐదింటికి రావటం, పొలం గట్టులకు నాన్నతోటి షికారు వెళ్ళటం, నాన్నతోటి భోజనం చేయటం, నాన్నను కౌగలించుకు పడుకుని నిద్రపోవటం, ఇదే కృష్ణ దినచర్య. రాత్రిపూట ఆయన కుర్చీలో దీపం పెట్టుకుని చాలాసేపు చదువు కుంటుండేవాడు. కదిలితే కృష్ణుడు అమ్మా అని యేడ్చేవాడు. జాబిల్లికి రాత్రికిరాత్రి వాడలా లేచి యేడుస్తుంటే చిరాకేసేది. జాలేసేది వొక్కొక్కసారి. పాపం తల్లి లేని పిల్లవాడు. ఆయన మాత్రం పలకడూ పులకడూ. జాబిల్లి ఎన్నో నాళ్ళు చూసింది. ఉక్రోష పడేది. లోలోపల యేడ్చేది. రాఘవరావుకి వేం పట్టవు. పోయిన మొదటి భార్యను తలచుకొని "తప్పు చేశాను, క్షమించవూ?" అంటూ కలవరించేవాడు. జాబిల్లి ఎన్నోనాళ్ళు చూసింది. ఏనాడయినా తీయగా పలకరించక పోతాడా అని. ఈ అసిధారావ్రతం జాబిల్లి కర్థంకాలేదు. ఓసారి తల్లికి జాబు వ్రాయాలనుకుంది. ఓసారి ఏదీ తేల్చుకోలేక దుఃఖపడేది. కుర్రాడు కొద్దికొద్దిగా మాలిమైనాడు. "పిన్నీ" అని పిలిచి దగ్గరకొచ్చేవాడు. కృష్ణ తనను "పిన్నీ" అని పిలవగానే జాబిల్లికి అన్నయ్య గుర్తువచ్చేవాడు. తాను పాలకీ ఎక్కివస్తుంటే తనవైపు దిగాలుపడ్డ మొహంతో చూశాడు. తన భవిష్యత్తును గురించి ఎంతో ఆందోళన పడుతుంటాడు మనసులో పాపం! అన్నయ్య మనసులో మెదలగానే జాబిల్లికి దుఃఖంవచ్చేది. రెండుసంవత్సరాలప్పుడు అమ్మ అన్నయ్యను వొళ్ళోకి తీసుకుంది. మాతృవాత్సల్యం అంతా చూపెట్టి అన్నయ్యను పెద్దవాణ్ణి చేసింది. ఇరుగు వాళ్ళు, పొరుగువాళ్లు అంతా ఆశ్చర్యపడేవాళ్ళట. అన్నయ్యతోటి "అమ్మ నీకు మారమ్మ" అంటే వొప్పుకోడు. జాబిల్లి ఇటువంటి ఊహలలోంచి మళ్ళీ కృష్ణ దగ్గరకొచ్చి 'పిన్నీ' అని పిలచినప్పుడు తెప్పరిల్లుకునేది. జాబిల్లికి కృష్ణచేత 'అమ్మా' అని పిలిపించుకుందామని రోజురోజుకు కోర్కె బలీయమైంది. ఓరోజు నీళ్ళుపోస్తూ "నన్ను పిన్నీ అని పిలవకు, 'అమ్మా' అని పిలు" అని చెప్పింది. కృష్ణ జాబిల్లివైపు బిక్కుబిక్కుమంటూ చూశాడు. జాబిల్లి వదిలిపెట్టలేదు. ప్రతిరోజూ చెప్పేది, "కృష్ణా నన్ను 'పిన్నీ' అని పిలవకు, 'అమ్మా' అని పిలువు" అని చెప్పింది. కృష్ణ తలూపి "తుండుగుడ్డ తెచ్చివ్వు పిన్నీ" అన్నాడు. జాబిల్లికి కోపమొచ్చింది. దగ్గరకొచ్చి వురిమి చూసింది. కృష్ణ భయపడి పోయాడు. ఏడుస్తూ "నాన్న అలా పిలవమన్నాడు, నాకేం తెలీదు. నాన్న పిలవమంటేను "పిన్నీ" అని పిలుస్తున్నాను" అన్నాడు. రాఘవరావు యింటికిరాగానే కృష్ణ చెప్పాడు. రాఘవరావు అడిగాడు "అయితే ఏమన్నది?" అని. "అమ్మా అని పిలవాలట నాన్నా!" కృష్ణ బెక్కుతూ చెప్పాడు. "అయితే పిలువు" అన్నాడు రాఘవరావు. కుర్రవాడు అయిష్టంగా తలవూపాడు. తలుపుచాటున నిలబడి జాబిల్లి ఇదంతా విన్నది. ఉన్నట్లుండి కృష్ణకు మర్రోజు జ్వరమొచ్చింది. జాబిల్లి చాలా భయపడ్డది. కాసేపు యేడ్చింది కూడాను. పిల్లవాడికి తనమూలంగా జ్వరం రాలేదుగదా? పిచ్చిపిచ్చి ఊహలతో రెండు మూడు రాత్రులు నిద్రపోలేదు జాబిల్లి. అమ్మా నాన్నా, లోకులూ, రాఘవరావు, కృష్ణా, ఫోటోలోచూసిన కృష్ణ తల్లీ, ఎప్పుడూ తన మనస్సులో మెదుల్తుండే వాళ్ళు జాబిల్లికి. జాబిల్లికి చాలా భయమేసింది. రాఘవరావు ఏమాత్రం నోరువిప్పేవాడు కాడు. ధైర్యం చెప్పేవాడు కాదు. అసలు పలకటమే లేకపోయె. టేబిలుమీది 'కృష్ణ' తల్లి ఫోటోవైపు

చూస్తూ కూర్చుండి పోయేవాడు. రెండుమూడు రోజులైనా జ్వరం తగ్గలేదు కృష్ణకు.

ఒకరోజు కృష్ణ అమ్మమ్మ దిగింది. జాబిల్లిపై పు కించిదీషణ తిరస్కారాలు వెల్లడయ్యేట్లు చూసి కుఱ్ఱవాడికిక్కడ నయంకాదని ఆర్భాటం చేసి, వెంటతీసుకుని వెంటనే వెళ్ళిపోయింది. జాబిల్లి కుమిలిపోయింది. ఆమెతోటి వొక్క మాటకూడా మాట్లాడలేకపోయింది. రాఘవరావు ఆవిడకేమీ అడ్డుచెప్పలేదు. ఇంట్లో చివరకు ఇద్దరే అయినారు. ఏపనిచేస్తున్నా, ఎక్కడున్నా జాబిల్లికి కృష్ణ గుర్తొచ్చేవాడు 'పిన్నీ' అని పిలుచుకుంటూ. జాబిల్లి హృదయం తుకతుక వుడికి పోయేది. భర్త మాట్లాడడు. కృష్ణసంగతి తెలీదు.

ఒకరోజు రాఘవరావు స్కూలు కెళుతుంటే తెగించి జాబిల్లి పలకరించింది: "ఒక కార్డుముక్క రాయకూడదూ, కృష్ణసంగతి తెలుస్తుందిగా, లేక పోతే వెళ్ళి తీసుకరాండి. నాకు తోచటంలేదు" అంది. రాఘవరావు దీనికూడా ఏమి సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయాడు. జాబిల్లి కుంగిపోయింది. రాఘవరావు వుదాసీనత అర్థంకాలేదు జాబిల్లికి. సాయంత్రం రాఘవరావు వంట ఇంటిగడప దగ్గర తారట్లాడాడు ఏదోచెపుదామని. జాబిల్లి వుత్సుకత కనబరచలేదు. ముఖం తిప్పేసుకుని తిరిగింది. రాఘవరావుఏమీమాట్లాడకుండనే వెళ్లిపోయాడు.

సాయంత్రానికి వెచ్చటి గాలి తగ్గి కాస్త చల్ల గాలి వీచటం మొదలెట్టింది. పంచలో మంచం వేసుకుని పడుకుంది జాబిల్లి. ప్రక్కనే మంచం వేసుక పడుకున్నాడు రాఘవరావు. జాబిల్లి కా రాత్రి పీడకల వచ్చింది. హృదయం కెలుక్కు పోయింది. నోట తడి ఆరింది. సన్నగా చినుకులు పడ్డాయి. మంచాలు లోపలకు లాక్కున్నతర్వాత అగ్గిపెట్టెకోసం వంటఇంట్లోకి వెళ్ళింది జాబిల్లి. గాలికి దీపం ఆరిపోయింది. దీపంముట్టించి కాసిని మంచినీళ్లు తాగి పడుకుంటేకాని ప్రాణం కుదుట పడదు. గుండె దడదడకొట్టుకుంటున్నది. అగ్గిపెట్టె కోసం గూట్లో చెయ్యిపెట్టింది జాబిల్లి. ఎవరిదో చెయితగిలింది. జాబిల్లికి ముచ్చెమటలుపోసినయ్. భయంపుట్టింది. "అమ్మా!"అని అరచింది. ఆ అరుపు అతిహీనస్వరాన వెలువడ్డది. జాబిల్లి వణికిపోయింది. "నేను జాబిల్లీ!" అన్నాడు రాఘవరావు. అంత భయంలోనూ, వణికిపోయే జాబిల్లికి నవ్వొచ్చింది. తానెంత భయపడ్డది! నీడనుచూసి బెదరింది. "మీరా!"అంది జాబిల్లి. గూట్లోని చేతిని ఆ విధంగానే పట్టుకుని దగ్గరకు లాక్కున్నాడు రాఘవరావు. జాబిల్లి రాఘవరావు వొళ్ళో సడలి, వడలి, పాపైంది. పడమటింట్లో వెన్నెల పాకింది. కొమ్మపైన కోకిల కూసింది.

# విపృచ్ఛ

సంపత్కుమార

దురాత్త ప్రమాద ప్రదోషాల నీల్గీ
పురాదృప్త వాంఛా విభుత్వాలనల్గీ
ధురాసంప్రపీడా ప్రతోదాల మూల్గీ
తరిస్తే–ఇదా జీవితం?

భ్రమాపాది వేషాల పట్టుల్ల చొక్కి
సమాక్లుప్త రోషాల సంకెళ్ళ చిక్కి
క్రమాల్లుప్త కోశాల రాపిళ్ళ మక్కి
దమిస్తే–ఇదా జీవితం?

త్రపానమ్ర మౌగ్ధ్యం ప్రతారించు గోడూ
అపావృత్త భాగ్యం విహాసించు కీడూ
ప్రపావర్తి భోగం విభక్తించు నాడూ
తపిస్తే–ఇదా జీవితం?

నినాద ప్రవాదాళి నిండించివేసీ
మనాగన్య భావాళి భ్రమందించి త్రోసీ
ఘనావర్తి తాథ్యాళి కల్పించిచూసీ
ధ్వనిస్తే–ఇదా జీవితం?